# అంతరాంతాలు

"రామారావుగారూ..."

మళ్ళీ అదే పిలుపు. ఆ స్వరంలో గౌరవం, ఆప్యాయత.

ఆవేపే పరకాయించి చూశాను. ఎరిగినవారెవరూ కనపడందే అయినా యీ మహానగరంలో నన్నెరిగినవారెందరున్నారు గనుక...

"రామారావుగారూ"

తిరిగి అద్దే పిలుపు. ఈసారి మరింత సమీపంగా. మరోకసారి వెనక్కి తిరిగాను. ఆ జనసందోహంలో పరిచయమైన మొహాలేవీ లేవు. ఎవరో బంట్రోతు చేయూపుతూ ఇటేవస్తున్నాడు. అంతకుమించి ఇంకేమీ గోచరించలేదు.

విసుగెత్తి నన్ను కాదనుకొని నాదారిన నేను నడచి పోసాగాను.

మరుక్షణమే భుజంమీద బలమైన చేయి పడటంతో ఉలిక్కిపడ్డాను. వెనుదిరిగి చూశాను.

చిరునవ్వుతో ఎదురుగా నిలబడ్డాడు రామ్మూర్తి.

కాఖీ గుడ్డలు, నెత్తిన టోపీ, జేబుకు గిల్టు అక్షరాలు. వాటిమధ్య సుపరిచిత దరహాస వదనం.

నా కళ్ళను నేనే నమ్మలేకపోతున్నాను. క్షణకాలమలాగే నిశ్చేష్టుణ్ణయి నిలబడిపోయాను.

నాతోపాటు ఇంటర్ వరకూ చదివిన రామ్మూర్తేనా యీ రామ్మూర్తి?

నా ఆశ్చర్యానికి అంతులేదు.

ఇంతలో ఎంతగా మారిపోయాడు రామ్మూర్తి. నాటికీ, నేటికీ పోలికే లేకుండా పూర్తిగా మారిపోయాడు.

ఆ రోజుల్లో...

మేం చదువు సంధ్యల్లో మునిగి తేలుతున్నప్పుడు సన్నగా, పీలగా వుండే రామ్మూర్తి, లోతుకు పోయిన కండ్లతో మరో లోకంలో విహరిస్తున్నట్లుండే ఈ రామ్మూర్తి వంటికి కండ పట్టింది. మొగంలో క్రొత్త కళ వచ్చింది. ఆ మెరిసే కళ్ళల్లో ఏదో తెలియని ధైర్యం, ఆత్మవిశ్వాసం. పోలిక పట్టడమే కష్టమయ్యేట్లు ఈ ఏడాదిలోనూ మనిషి రూపుమారాడు.

అయితే నన్నాకర్షించిందీ, చకితుణ్ణి చేసిందీ ఇది గాదు.

మనిషి మారటానికెంతో కాలం అవసరం లేదు. కొద్ది మాసాల్లో లావెక్కనూవచ్చు. బక్కచిక్కనూవచ్చు. కాలేజీ రోజుల్లో నాకు గట్టిగా షేక్‌హ్యాండ్ ఇవ్వడానికే వెనుదీసే రామ్మూర్తి ఈనాడిలా బలంగా, దృఢంగా ఉండటంలో ఆశ్చర్యపడవలసింది లేదు.

మరి...

నేను చూస్తున్న దొరకేం. నన్నాకర్షించింది ఒకరేం, నన్ను చకితుణ్ణి చేసింది అదే! అదే ఆ వేషం. ఇందాక దూరంనుంచి పిలుస్తున్నప్పుడు గుర్తుపట్టలేకపోవ్యాని ఆ వేషం.

నాతో ఇంటర్ చదివి, నన్ను మించి ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయిన రామ్మూర్తి ఈ వేషంలో...

నా ఆయోమయస్థితిని అర్థంజేసుకొన్నవానిలా చిరునవ్వు నవ్వాడు రామ్మూర్తి.

అదే నవ్వు. అలా నవ్వగలగటం రామ్మూర్తికే చేతనవును. అదే అతనిలో ప్రత్యేకత. మనిషి ఎంతగా మారినా ఆ ధోరణిలో మాత్రం మార్పులేదు.

ఆ చిరునవ్వే, ఆ కష్టసహిష్ణుతే నన్నాతనికి సన్నిహితుణ్ణి చేసింది.

కాకపోతే అప్పట్లో అతనెక్కడ? నేనెక్కడ?

నూటపాతిక సంపాదించుకొనే గుమాస్తా కొడుకు రామ్మూర్తి.

నలగని మడతలతోగాని కాలేజీలో అడుగుపెట్టని నాగరీకుణ్ణి నేను.

అప్పట్లో నా స్నేహితులంతా పెట్టిపుట్టినవాళ్ళు. రెండు చేతులా ఖర్చుపెట్టగల శక్తిమంతులు. అయినా వారందరినీ మించి అప్రశుతిలా రామ్మూర్తి ఒక్కడే నాకు సన్నిహితుడయ్యాడు.

ఆ రోజుల్లో నా వేషం, నా ఖర్మ చూసి అంటుండే వాడు రామ్మూర్తి ఈ చిరునవ్వుతోనే "వడ్డించిన విస్తరి నీ జీవితం" అని.

అప్పట్లో నేనా మాటల్ని గురించి అంతగా పట్టించుకునేవాణ్ణి కాదు. కాని ఇప్పుడు గుర్తుకువస్తూంది. ఎంతలో ఎంత మార్పు. నాడు నలగని మడతలు ధరించిన నేను యీ రోజు ఇంట్లో ఉతికి యిస్త్రీ చేసిన గుడ్డలు కట్టుకొని సాగర మధ్యంలో గమ్యం తెలీని నావలా అయోమయపు పరిస్థితుల్లో ఇక్కడ నిలబడ్డాను. ఈ రామ్మూర్తి ఎదురుగా నిలబడ్డాను !...

నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ తిరిగి అదే నవ్వు నవ్వాడు రామ్మూర్తి. "అలా తెల్లబోయి చూస్తావేమిటి మిత్రమా ?"

నేను తెప్పరిల్లాను. అతనివంక నిదానించాను. "కాదా మరి ఇదేం వేషం?"

"కనపడుతూనే ఉందిగదా ప్యూన్ వేషం" మందహాసంతోనే ప్రత్యుత్తరమిచ్చాడు రామ్మూర్తి.

"అంటే?"

"అంటే ఏముంది. అచ్చ తెలుగులో చెప్పాలంటే యీ రామ్మూర్తి బంట్రోతుగా పనిచేస్తున్నాడు."

"ఛ..."

"ఛ... ఏమిటి? చూస్తూనే వున్నావుగదా"

"ఇదేం ఖర్మ నీకు?"

"కాకపోతే మరేం చేసేది? ఖర్మమనుకోకపోతే కడు పెలా నిండుతుంది?"

"అయినా యింత చదువూ చదివి ఇదా నువ్వు చేసేది?"

"ఇంత చదివినంతమాత్రాన ఇలా చేయకూడదని ఏముంది?"

నేనేం చెప్పగలను?

"అలాగని కాదు ఇంటర్ ఫస్ట్‌లో ప్యాసయ్యావాయె. ఇంకొంచెం శ్రమపడితే డిగ్రీ అయినా వచ్చేది. ఇంతకన్నా మంచి ఉద్యోగం దొరికే అవకాశం వుండేదిగదా."

శ్రమపడటానికేం ఎంతయినా శ్రమపడగలను. కాని డిగ్రీ సంపాదించడమంటే మాటలా? అందుకు తగిన స్తోమతు వుండవద్దా"

నేనేమనగలను. రామ్మూర్తి స్థితిగతులు నాకు తెలియనివి గావాయె.

"సరే అయితే మరి యేనాటినుంచి ఏమయినట్టు? అప్పటినుంచి ఇక్కడే నా మకాం" అన్నాను సంభాషణ ప్రక్కకి మళ్ళిస్తూ.

"ఏముంది యీ ఉద్యోగమయినప్పట్నుంచీ యిక్కడే మకాం. ఇప్పుడు మా కుటుంబం కూడా ఇక్కడే ఉంది. ఎటు పోవటానికీ తీరికలేందే."

నేను మాట్లాడలేదు. రామ్మూర్తే తిరిగి అడిగాడు.

"మీ చదువు ఎలా వుంది"

"చంకనాకింది"

"అంటే?"

"నీకింకా తెలీదా? నేను కాలేజీ మొహంచూసి అయిదారు మాసాలవుతూంది"

"నిజంగా?"

"కాకపోతే అబద్ధాలాడవలసిన అవసరమేమిటి?"

"అబ్బే, హాస్యానికంటున్నారేమోనని"

"అదేమీ లేదు. మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది మానేశాను. అంతే"

"అదేమిటి?"

"ఏముందీ? చదువుకయిన ఖర్చూ, చెల్లెలి పెళ్ళికయిన ఖర్చూ కలిసి ఉన్న అయిదెకరాలలోనూ చాలా భాగం ఊడ్చిపెట్టాయి. ఫలితం నేను చదువు మానుకోవాల్సొచ్చింది."

రామ్మూర్తి నిర్ఘాంతపోయినట్లు అతని ముఖకవళికలు చెప్పకనే చెపుతున్నాయి. కొద్ది క్షణాల తరువాతగాని తిరిగి మాటాడలేకపోయాడు.

"అయితే ఇప్పుడేం చేస్తున్నారు?"

"ఏముంది రోడ్లు దుమ్ము జేస్తున్నాను"

"అంటే?"

"ఇదివరలో నీవు అంటుండేవాడివి గుర్తుందా? 'వడ్డించిన విస్తరి నీ జీవితం' అని. కాని కాలం మారింది.

ఇప్పుడు పడ్డించవలసిన వాడిని నేనే. అందుకే ఉద్యోగం కోసం వేటాడుతున్నాను."

"మరి మీ ప్రయత్నాలెలా ఉన్నాయి?"

"ఎలా వుండాలో అలా ఉన్నాయి డిగ్రీలున్నవాళ్ళకే గతిలేదే. ఇంక నా మొగం చూసేదెవరిక్కడ?"

రామ్మూర్తి మాటాడలేదు. సంభాషణ సూరుద్దామని నేనే అడిగాను. "నీ పనెలాఉంది?"

"పనికేం బాగానే వుంది. రోజల్లా తిరగటమే"

"మరి జీతం?"

"పది పదులు" తలవంచుకునే జవాబిచ్చాడు రామ్మూర్తి.

"పది పదులు" అనేమాట నా మస్తిష్కంలో గింగురు మనసాగింది! కథల్లో చాలీ చాలని జీతాల్తో అష్టకష్టాలు అనుభవించే క్రిందితరగతి మనుష్యుల్ని మాత్రమే ఎరిగిన నేను రామ్మూర్తి జీతం వంద రూపాయలంటె నమ్మలేకపోయాను! అదే అనుమానంతో రామ్మూర్తి వంక చూశాను!

"పదిపదులు" అమాటే నా మనసులో మెదలసాగింది! కాని ఇంతలో ఏదో పట్టినట్లయ్యింది!

"ఎంతయినా ప్యూన్ పనిగదా!"

మనసులో తట్టినమాట అప్రయత్నంగా అనుకోకుండానే పైకి అనేశాను! అన్నతరువాత అలా ఎందుకన్నానా! రామ్మూర్తి మనసు ఎందుకు బాధపెట్టానా అని విచారించ

సాగేను. కాని రామ్మూర్తి నే ననుకున్నట్లు బాధపడలేదు సరికదా అదే చిరునవ్వుతో సమాధానమిచ్చాడు.

"మీరు పొరబడుతున్నారు రామారావుగారూ. మన మంతా యీ ఉద్యోగాలు చేస్తున్నది జీతంరాళ్ళకోసమే గదా. చూడండి, గుమాస్తాకూ నాకూ తేడాఏమిటి? ఆయన ఆఫీసులో కూర్చుని పనిచేస్తుంటే నేను బయట పనులమీద తిరుగుతుంటాను. ఉన్న తేడాఅల్లా "ప్యూన్" అనే మాటలో వుంది. అంతేగదా!"

"అయినా యింత చదువూ చదివి..."

"ఏం చెయ్యను రామారావుగారూ. ఇంకా చదవగల తాహతు నాకులేదు. ఒకవేళ చదివినా పెద్దఉద్యోగం దొరుకు తుందని నమ్మకమేమిటి? అయినా యీ చదువులెందుకు? ఉద్యోగాల కోసమేగదా? ఉద్యోగాలెందుకు? జీవన భృతి కోసమే గదా? నాకిప్పుడు మామూలు గుమాస్తాకు వచ్చే జీతంతో దాదాపు సమానమైన జీతం వస్తూంటే, అలాంటప్పుడు 'అయ్యో, ప్యూన్‌గా తయారయ్యానే' అని నేనెందుకు బాధపడాలి?"

అవునుమరి. రామ్మూర్తి చెప్పినదాంట్లో నిజం లేక పోలేదు. ఆర్నెల్లుగా ఉద్యోగంకోసం చెడతిరుగుతూ నిరాశా నిస్పృహల్లో మునిగితేలుతున్న నాకు రామ్మూర్తిమాటల్లోని వాస్తవం క్రమక్రమంగా గోచరించసాగింది.

అప్పుడే ఆర్నెల్లక్రితం ఏ ఉద్యోగమూ దొరకక, చివరికి ఏదో గుమాస్తా ఉద్యోగం ఉందనితెలిసి దానికోసం

ప్రయత్నించబోతే, మా నాన్న అడ్డువచ్చి అన్నమాటలు గుర్తుకువచ్చాయి. "ఇంత బ్రతుకూ బ్రతికి, ఇంత చదువూ చదివి, చివరికి గుమాస్తా ఉద్యోగమా? ఛీ...!ఛీ...!"

అంతటితో నా ప్రయత్నమూ ఆగిపోయింది. నాడెలా ఉన్నానో నేడూ అలాగే అంతకుమించిన నిరాశలో మునిగి వున్నా! "మంచి ఉద్యోగం" మాట అలావుంచి అసలు ఉద్యోగమనేది దొరుకుతుందనే నమ్మకం లేకుండా పోతూంది!

మరి రామ్మూర్తి...!

ఆలోచించినకొద్దీ నాకూ, రామ్మూర్తికీ మధ్య ఉన్న అంతరం స్పష్టం కాసాగింది!

అదృష్టవంతుడు రామ్మూర్తి!